సాక్షి చిత్తూరు

శుక్రవారం । 26 । జనవరి । 2024

I



టీటీడీ పరిధిలోకి రాజనాలబండ

దేవదాయ శాఖ అధికారులు రాజనాలబండ ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొన్నూ ఉత్తర్వులు జారీ చేశారు. - IIలో



ప్రజలకు ఓటే వజ్రాయుధం

రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ అందించిన వజ్రాయుధం ఓటు హక్కు అని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - IIలో



బాలిక అప్పగింత

తప్పిపోయిన గంటల వ్యవధిలోనే బాలికను వెదికి పట్టుకున్న సదుం ఎస్ఐ మారుతి గురువారం తల్లికి అప్పగించారు. - IIలో

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎస్పీ, 9.05కు కలెక్టర్ ఆగమనం, జాతీయపతాకావిష్కరణ, ఉ.9.10 గంటలకు కలెక్టర్ గౌరవ వందన స్వీకరణ, పోలీసు పరేడ్ తనిఖీ, ఉ.9.25 గంటలకు కలెక్టర్ సందేశం, ఉ.9.50 గంటలకు జిల్లా ప్రగతి శకటాల ప్రదర్శన, ఉ.10.10 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉ.10.40 గంటలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం, ఉ.11.45 గంటలకు స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, ఉ.11.55 గంటలకు జాతీయగీతాలపనతో కార్యక్రమం ముగింపు ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రతిభ చాటిన 156 మందికి ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

భక్తిశ్రద్ధలతో ఇస్తిమా



మతబోధనలు వింటున్న ముస్లింలు

పుంగనూరు: ఉమ్మడి జిల్లాల నుంచి వేలాది మంది ముస్లింలు హాజరై భక్తిశ్రద్ధలతో ఇస్తిమా కార్యక్రం నిర్వహించారు. ఈ ఇస్తిమా గురువారం రాత్రి ముగిసింది. ఇందులో బెంగళూరుకు చెందిన మత గురువులు మౌలనాఫరూక్ సాహెబ్, అక్బర్‌సాహెబ్, ముఫ్తీఅస్లాంసాహెబ్, ఎంఎస్.సర్దార్ సాహెబ్ మత బోధనలు చేశారు. నమాజ్, ఖురాన్ పఠనం, పేదలను ఆదరించడం లాంటి కార్యక్రమాలపై గురువులు బోధనలు చేశారు. ఇస్తిమాకు హాజరైన వేలాది మందికి భోజనం ఏర్పాటు చేశారు. చిన్నపెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఇస్తిమాలో పాల్గొని రెండు రోజుల పాటు ఐక్యతను చాటుకున్నారు. కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ములు కలసి ఇస్తిమా పర్యవేక్షించారు.

'గురుకుల' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం: మండలకేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ, బైపీసీ) ఆంగ్లమాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజేంద్ర తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న నిర్వహించనున్నట్లు చెప్పారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు కోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు 9704550107ను సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తం.. సత్యనారాయణ వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

కాణిపాకం(యాదమరి): స్థానిక శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం ఆలయంలో వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణ స్వామి అలంకరణలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతాన్ని అర్చకులు వేద మంత్రాలతో నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వ్రతాన్ని ఆచరించారు. సాయంత్రం మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో స్వామివారు గరుడవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



"క్యాన్సర్ చికిత్స కోసం మన రాష్ట్రానికి చెందిన ఎవరూ కూడా వేరే ప్రాంతానికి వెళ్లకూడదు. పేదలు, అట్టడుగు వర్గాల వారి కోసం ప్రపంచస్థాయి వైద్య సౌకర్యాలతో ఆస్పత్రి కావాలి".. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర స్థాయి అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్న మాటలు ఇవి. ఆయన లక్ష్యం మేరకు శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదాల చెంత తిరుపతిలో స్విమ్స్ యూనివర్సిటీకి అనుబంధంగా శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ రూపుదిద్దుకుంటోంది.

శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ భవన నమూనా



క్యాన్సర్‌పై సమరం

• పేదోడికి అంతర్జాతీయ వైద్యం

క్యాన్సర్.. మనిషిని తినేస్తుంది.. ఎప్పుడు.. ఎందుకు.. ఎలా వస్తుందో తెలియదు. వయసు, లింగ భేదంతో సంబంధం లేకుండా మనిషి శరీరంలో వైరస్ చేరి చంపేస్తుంది. అయితే మన దేశంలోని పలువురు సెలబ్రిటీల ముందు క్యాన్సర్ ఓడిపోయింది. వారిలో ఎక్కువమంది అమెరికాలో చికిత్స పొందారు. మరి పేదల పరిస్థితి ఏంటి? మన రాష్ట్రంలో వేలాది వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు. అయితే క్యాన్సర్ మహమ్మారిపై అట్టడుగు వర్గాల ప్రజలు కూడా విజయం సాధించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం. ఆయన ఆలోచనల నుంచి పురుడుపోసుకున్నదే తిరుపతిలోని శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ.

- క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో తిరుపతిలో ఆస్పత్రి ఏర్పాటు
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో నిర్మిస్తున్న టీటీడీ
- వెంకన్న పాదాల చెంత స్విమ్స్ అనుబంధంగా ప్రత్యేక వైద్యశాల
- 14 విభాగాలతో మార్చి చివరికి ప్రారంభించే దిశగా పనులు వేగవంతం

సాక్షి, తిరుపతి డెస్క్: సమాజాన్ని పట్టిపీడిస్తున్న అత్యంత ప్రమాదకారి క్యాన్సర్. నూటికి 7 నుంచి 10 మంది వరకు క్యాన్సర్ కారక లక్షణాలు కలిగి ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. రాయలసీమ జిల్లాల్లో నూటికి 10 నుంచి 15 మందిలో వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. అయితే శ్రీమంతులు మాత్రమే క్యాన్సర్‌కు వైద్యం చేయించుకునే రోజులు ఇవి. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. దాదాపు 4000 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. వెయ్యి రూపాయలకు మించి ఖర్చయ్యే వైద్యాన్ని ఆరోగ్యశ్రీలోకి చేర్పించారు. పొరుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీ వర్తింపజేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పేదవాడికి కూడా అంతర్జాతీయ స్థాయిలో క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు ఆసుపత్రిని నిర్మించాలని సంకల్పించారు. టీటీడీ సహకారంతో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (ఎస్‌బీఐఓ)ని నిర్మిస్తున్నారు. సీఎం ఆదేశాలు ఇచ్చిన 8 నెలల కాలంలోనే పనులు దాదాపు పూర్తి చేసుకున్నాయి.

క్యాన్సర్ ఏదైనా.. ఇక చికిత్స ఇక్కడే

రాష్ట్రంలో ఇప్పటివరకు మెడిసిన్, రేడియేషన్, సర్జికల్ ఆంకాలజీలు, న్యూక్లియర్ మెడిసిన్, రేడియో డయాగ్నస్టిక్, ఆంకో పెథాలజీ, పీడియాట్రిక్ ఆంకాలజీ వంటి క్యాన్సర్లకు మాత్రమే వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఇతర క్యాన్సర్‌కు ఇప్పటివరకు రాష్ట్రంలో వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. ఇలాంటి వైద్య పరీక్షలు చేయాలంటే ఢిల్లీ ఎయిమ్స్, టాటా మెమోరియల్ ముంబయి, చెన్నై అడయార్ వంటి ఆస్పత్రులకు శాంపిల్స్ పంపించాల్సిన దుస్థితి ఉండేది. అక్కడి నుంచి రిపోర్టు వచ్చేవరకు నెలల తరబడి రోగులు నిరీక్షించక తప్పేది కాదు. ఇప్పుడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆస్పత్రిలోనే అన్నిరకాల క్యాన్సర్లకు వైద్య చికిత్స అందుబాటులోకి రానుంది.

14 రకాల క్యాన్సర్లకు అత్యాధునిక చికిత్స

టీటీడీ నిర్మిస్తున్న శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (ఎస్‌బీఐఓ) ఆస్పత్రిలో 14 రకాల క్యాన్సర్ విభాగాలతో నిర్మిస్తున్నారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, పెయిన్ అండ్ ప్యాలియేషన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్, జిరియాట్రిక్ ఆంకాలజీ, జీనోమిక్ లేబొరేటరీ, ప్రివెంటివ్ ఆంకాలజీ, క్యాన్సర్ రిజిస్ట్రీ వంటి రాష్ట్రంలో ఎక్కడా లేని క్యాన్సర్ విభాగాలు ఇక్కడ అందుబాటులోకి తీసుకురానున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం పీడియాట్రిక్ ఆంకాలజీని ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. క్యాన్సర్ నిర్ధారణ కోసం ఇక చెన్నై, ముంబయి, ఢిల్లీలోని ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చొరవ తీసుకుంది. మరో 60 రోజుల్లో ఆసుపత్రిని ప్రారంభించేలా శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.150 కోట్లతో ఆస్పత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని అభివృద్ధి చేయడంతో పాటు రూ.200 కోట్ల విలువైన అత్యాధునిక క్యాన్సర్ చికిత్స కోసం వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఏడు అంతస్తుల భారీ భవన నిర్మాణాన్ని ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో 400 బెడ్ల సామర్థ్యంతో 50 ఐసీయూ, ఎనిమిది ఆపరేషన్ థియేటర్లు, 60 ప్రత్యేక గదులతో నిర్మాణం జరుగుతోంది. అలానే రేడియేషన్ విభాగం కోసం ప్రత్యేకంగా బంకర్ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ భవనం

క్యాన్సర్ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



"క్యాన్సర్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన మానస పుత్రికగా క్యాన్సర్ ఆసుపత్రికి శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించేందుకు కసరత్తు పూర్తిచేశాం. మొదటి దశలోనే క్యాన్సర్‌ను అరికట్టేందుకు స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టనున్నాం. దీనివల్ల రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో క్యాన్సర్‌ను కనుమరుగు చేయవచ్చు. ఈ ఆస్పత్రిని భవిష్యత్‌లో క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మార్చి చివరి నాటికి ఈ ఆస్పత్రిని ప్రారంభించాలన్న లక్ష్యంతో నిర్మాణ పనులు సాగుతున్నాయి.

– డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి, ప్రత్యేక అధికారి, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ

సమాచారం

ఆసుపత్రి పేరు: శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ

వెచ్చిస్తున్న ఖర్చు	రూ.150 కోట్లు
భవన విస్తీర్ణం	మూడు లక్షల చదరపు అడుగులు
భవనం ఎత్తు	7 అంతస్తులు
బంకర్ బ్లాక్ (రేడియేషన్ విభాగం కోసం)	2 అంతస్తులు
వైద్య పరికరాల కోసం	రూ.200 కోట్లు
బెడ్ల సామర్థ్యం	400
ప్రత్యేక గదులు	60
మొత్తం వైద్యులు	54 మంది
నర్సులు	96 మంది
పారామెడికల్ స్టాఫ్	51 మంది
పరిపాలనా సిబ్బంది	40 మంది
ఇతర సిబ్బంది	70 మంది

ఆంకాలజీ విభాగాలు

ప్రస్తుతం స్విమ్స్‌లో ఉన్న విభాగాలు మొత్తం	4

మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్

కొత్తగా ఏర్పాటు కానున్న ఆంకాలజీ విభాగాలు	10
రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని, ఇక్కడ మాత్రమే ఏర్పాటు చేస్తున్న విభాగాలు	7

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, పెయిన్ అండ్ ప్యాలియేషన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్, జిరియాట్రిక్ ఆంకాలజీ (60 సంవత్సరాలు పైబడిన వారి కోసం), జీనోమిక్ లేబొరేటరీ, ప్రివెంటివ్ ఆంకాలజీ, క్యాన్సర్ రిజిస్ట్రీ.

ఇంకా ఏర్పాటు చేస్తున్న విభాగాలు: పీడియాట్రిక్ ఆంకాలజీ, ఆంకో పెథాలజీ, రేడియో డయాగ్నస్టిక్

ప్రస్తుతం స్విమ్స్‌లో ఏటా నమోదవుతున్న ఓపీ(మూడు విభాగాలకు)లు

మొత్తం ఓపీలు	50,000
ఇన్ పేషెంట్	12,000
రేడియోథెరపీ	2000
సర్జరీలు	4000
కీమోథెరపీ	13,000

నెలవారి నమోదు అవుతున్న ఓపీ వివరాలు

2022 డిసెంబర్‌లో..

సర్జికల్ ఆంకాలజీ ఓపీ	1,250
అడ్మిషన్లు	130
మెడికల్ ఆంకాలజీ ఓపీ	2,500
అడ్మిషన్లు	800
రేడియేషన్ ఆంకాలజీ ఓపీ	195
అడ్మిషన్లు	200
ఐసీయూ బెడ్లు	50

ప్రజాభీష్టం మేరకే ఆలయ పునర్నిర్మాణం



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పర్యాటక శాఖ మంత్రి రోజా

పుత్తూరు: ప్రజల అభీష్టం మేరకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టినట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. పట్టణంలోని కోనేరు ఆవరణలో అవదూత శ్రీ సారకాయల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం మంత్రి భూమి పూజ చేశారు. రోజా మాట్లాడుతూ అవదూత అయిన శ్రీసారకాయల స్వామి పుత్తూరు, నారాయణవనం ప్రాంతాల్లో నడయాడినట్లు చరిత్ర చెబుతోందన్నా రు. ఆయన జీవ సమాధి అనంతరం పుత్తూరులో ఏర్పాటు చేసిన ఆలయంలో ప్రతిరోజూ ధూపదీప నైవేద్యాలతో ప్రజలు కొలిచేవారని తెలిపారు. 2005లో అభివృద్ధి పేరిట అప్పటి నాయకులు కోనేరును పూడ్చి వేయడంతోపాటు, ఆలయాన్ని కూల్చివేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని గుర్తుచేశారు. అయినా వారు చెప్పిన అభివృద్ధి ఇక్కడ ఏమాత్రం జరగలేదన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో కోనేరును పునర్నిర్మించినట్లు తెలిపారు. అయితే టీడీపీ నాయకులు కోర్టు ద్వారా ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న విషయం ఇక్కడి ప్రజలందరికీ తెలుసన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించిన కొండచుట్టు మండపాన్ని సైతం రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించి, సంక్రాంతి పండుగను వైభవంగా జరిపినట్లు స్పష్టం చేశారు. ప్రజలు ఏది కోరితే అది నెరవేర్చడానికి జగనన్న సైనికులుగా తాము అన్ని వేళలా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఫలితంగా ప్రజల ఆశీస్సులు తమకు అన్నివేళలా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఆలయ చైర్మన్లు రమేష్ బాబు, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, సింగిల్ విండో ప్రెసిడెంట్లు శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, కౌన్సిలర్లు అనిత, ఏకాంబరం, నరసింహారావ్, చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్, శ్రీని వాసులు, కార్తికేయన్, గాంధీ, జయబాబు, మునిరత్నం, చిన్నా, చక్రి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఏఈఆర్‌ఓగా అరుణ



జ్ఞాపికను అందుకుంటున్న నగర కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఉత్తమ ఏఈఆర్వోగా నగర కమిషనర్ జె అరుణ ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఏఈఆర్వోగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ షణ్మోహన్ ఐఏఎస్, సీనియర్ సివిల్ జడ్జ్ ఐ.కరుణ కుమార్, జేసీ పి.శ్రీనివాసులు చేతులమీదుగా అందుకున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ- 2024 కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. స్వీప్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, వార్డు కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను భాగస్వామ్యం చేస్తూ నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి అవగాహన కల్పించారు. 18, 19 ఏళ్ల యువతను ఓటర్లుగా నమోదు చేయడం కోసం కళాశాల స్థాయిలో ప్రత్యేక అవగాహన, ఓటు నమోదు కార్యక్రమాలను చేపట్టారు. ఫలితంగా 4,149 మంది 18, 19 ఏళ్ల వారు కొత్త ఓటర్లగా నమోదయ్యారు. మొత్తంగా 12,260 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. ఓటర్ల నమోదు, సవరణ కార్యక్రమాలపై ఆటోలు, నగరపాలక సంస్థ చెత్త సేకరణ ఆటోలు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన విస్తత ప్రచారం ద్వారా ఫారం-6, 7, 8 లు మొత్తం 51,962 వచ్చాయి. ఈ దరఖాస్తులను ఇంటింటి పరిశీలన ద్వారా తనిఖీ చేయించారు. కమిషనర్ స్వయంగా వెళ్లి డోర్ టు డోర్ తనిఖీలు చేపట్టారు. సూపర్‌వైజర్ అధికారులను, బీఎల్‌ఓలను సమన్వయం చేసుకొని ఓటర్ల నమోదు, సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫలితంగా తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేశారు. ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడా లేని విధంగా ట్రాన్స్‌జెండర్లకు ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

10లోపు భవనాల ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో నూతనంగా నిర్మించిన పలు భవనాలకు ఫిబ్రవరి 10వ తేదీ లోపు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయ సమావేశపు మందిరంలో గురువారం చైర్మన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. డిసెంబర్‌లో ఆదాయ వ్యయాలను చర్చించి ఆమోదించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆలయ చైర్మన్, ఈఓ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో నిర్మించిన లడ్డుపోటు, అన్నదాన భవనం, ప్రహరీ గోడలు, ఆర్చిలు, ఫిబ్రవరి 10 లోపు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. ఆంజనేయ స్వామి ఆలయం రాతి కట్టడాలతో నిర్మించడానికి దాత అనిల్‌కుమార్ రూ.1.10 కోట్లు విరాళంగా ఇస్తున్నారన్నారు. ఎన్ఆర్ఐలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ ప్రధాన ఆలయానికి వెండి వాకిలి అందించారని చెప్పారు. అంతరాలయంలో బంగారు తాపడంతో ఏప్రిల్‌లోపు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అద్దాల మండపం నిర్మాణానికి విరాళం అందించిన దాత మహేశ్వర్ రెడ్డి ప్రధాన ఆలయంలో స్వామివారి వెనుక భాగంలో బంగారు తాపడానికి అయ్యే ఖర్చు ఆయనే విరాళంగా అందిస్తున్నట్లు వివరించారు. స్వామివారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు దర్శనం కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు రవీంద్రుడు, కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ, జయశ్రీ , ఎక్స్‌అఫిషియో సభ్యులు సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్ర బాబు, విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

27 నుంచి ఇళ్ల రిజిస్ట్రేషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ నుంచి పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం క్యాంపు కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ఆయా సచివాలయ పరిధిలో నిర్వహించాలని ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక లాగిన్‌లు సీసీఎల్ఏ నుంచి వస్తాయని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈ సెక్షన్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

చిత్తూరు అర్బన్: అత్త, వదినపై దాడి చేసిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ ఉలసప్ప తెలిపారు. శంకరయ్య గుంటలో బుధవారం రాత్రి నూర్(42) అనే వ్యక్తి హురాన్, సల్మా అనే మహిళలపై కత్తితో దాడి చేశాడు. గొంతుపై తీవ్ర గాయాలు కావడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు నూర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ప్రజలకు ఓటే వజ్రాయుధం

- అట్టహాసంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- కొత్త ఓటర్లకు కార్డులు అందజేత
- సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం



ఓటు హక్కు వినియోగంపై అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పాల్గొన్న అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఇందులో కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రతి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామోషీగా భావించకుండా ఓటు హక్కును ఎన్నికల్లో వినియోగించుకోవాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనేలా చేయడమే జాతీయ ఓటర్ల దినోత్సవం ఉద్దేశమని చెప్పారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

ఓటు ప్రాథమిక హక్కు

ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. బ్రిటీష్ వారి నుంచి మనం స్వాతంత్ర్యం పొందిన తర్వాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం నుంచి పొందిన హక్కుల్లో ఓటు హక్కు ముఖ్యమైందన్నారు. ఒకరి ఓటును మరొకరు వేసేందుకు హక్కు లేదని చెప్పారు. ప్రాథమిక హక్కుల్లో ఓటు హక్కు ఒక భాగమని, ఆ హక్కుకు భంగం కలిగితే సుప్రీం, హైకోర్టులను ఆశ్రయించవచ్చన్నారు.

యువత ఓటింగ్ ముఖ్యం

యువతరం ఓటింగ్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. దేశ భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దడంలో యువత ఓటింగ్ చాలా ముఖ్యమని చెప్పారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత ఓటు హక్కును వరుసగా వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్స్ కేఎస్.శంకర్‌రావు, సుమిత్ర, హయత్, నారాయణస్వామిని, ఓటరు నమోదు కసరత్తులో విశేష కృషి చేసిన నగరి ఆర్డీఓ సుజన, ఈఆర్‌ఓలు అరుణ, రవి, విజయ్, తదితర బీఎల్‌ఓలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ క్రీడాకారుడు తులసిరెడ్డి, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుల్జార్, ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ డా.అరుణ, తహసీల్దార్ మురళిమోహన్, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఈఓ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ సెల్వరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ పరిధిలోకి రాజనాలబండ

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామి ఆలయం, సమీపంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు టీటీడీ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో చరిత్రాత్మక ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు విశిష్ట కృషిచేశారని కొనియాడారు. తిరుపతి గోవిందరాజస్వామి టెంపుల్ డిప్యూటీ ఈఓ శాంతి, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరం కలిసి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ తాళాలను టీటీడీ అధికారులకు అందజేశారు. ఆలయానికి చెందిన భూములు, బంగారు, వెండి ఆభరణాలతోపాటు ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు ఇక నుంచి టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ మేరకు ఆలయ ఆదాయ వనరులు, ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ ఈఓ శాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యువెలరీ ఏఈఓ మణి, జనరల్ సెక్షన్ డిప్యూటీ ఈఓ శివప్రసాద్, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ వెంకట్రమణ, ల్యాండ్స్ ఎస్టేట్ విభాగం తహసీల్దార్ లలితాంజలి, టెంపుల్ ఇన్‌చార్జి భానుప్రకాష్ తదితరులున్నారు.


బోయకొండలో నిర్వహిస్తున్న చండీ హోమం

భక్తి శ్రద్ధలతో చండీ హోమం

బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఉత్సవ మూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి అభిషేక పూజలు చేశారు. పూర్ణాహుతి అనంతరం ఉభయదారులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.

బాలిక అప్పగింత

సదుం: అదృశ్యం అయిన బాలిక ఆచూకీని గంటల వ్యవధిలోనే గుర్తించినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీకి చెందిన అరుణ్, రాధ దంపతుల కుమార్తె(12) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. పాఠశాల నుంచి వచ్చి బుధవారం సాయంత్రం ఇంటికి సమీపంలోని రోడ్డు పక్కన బ్యాగు ఉంచి ఎక్కడికో వెళ్లిపోయింది. తల్లి రాధ పోలీసులకు గురువారం ఉదయం ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గాలింపు చర్యలు చేపట్టారు. సీత చెరువు గుట్ట సమీపంలో బాలిక ఉండగా గుర్తించి, తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

మద్యం ధ్వంసం


మద్యాన్ని జేసీబీతో ధ్వంసం చేస్తున్న పోలీసులు

బంగారుపాళెం: అధికారులు తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని గురువారం ధ్వంసం చేశారు. సీఐ నాగరాజరావు కథనం మేరకు, మండలం పరిధిలో 2020 నుంచి 2023 సంవత్సరం వరకు కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 3,743 (336 లీటర్లు) మద్యం బాటిళ్లు, టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ మద్యాన్ని సెబ్ డీఎస్పీ బాబుశ్రీధర్ ఆధ్వర్యంలో గురంకొండ వాండఊరు సమీపంలో జేసీబీతో ధ్వంసం చేసినట్లు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



గుడిపాల: చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు, కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో చేరిన టీడీపీ కుటుంబాలు

గుడిపాల: చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరాయి. మండలంలోని చీలాపల్లె పంచాయతీలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 20 కుటుంబాలు చేరడంతో విజయానందరెడ్డి వారికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నాగేంద్రనాయుడు, శీను, నరసింహులు, సూరి, భూపతినాయుడు, విజయ్ నాయుడు, టైలర్ బాబు, వెంకటేశులు, చిన్నబ్బ, పురుషోత్తంనాయుడు, ఆనందనాయుడు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

గుడుపల్లె మండలం నాయకులు

కుప్పం: గుడుపల్లె మండలం పిబీ వాడు పంచాయతీ కమ్మగుట్టపల్లెకి చెందిన 10 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో 10 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు

అమరనాథ రెడ్డి ఏడుపు విడ్డూరం


సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ నాగరాజు

వి.కోట: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మంత్రి పెద్దిరెడ్డి పట్టించుకోలేదని టీడీపీ మాజీ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఏడవడం విడ్డూరంగా ఉందంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు అన్నారు. ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటనకు మండలం మీదుగా వెళుతుండడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చి మాట్లాడారు. తమకు వాటర్‌బిల్లు చాలా రోజులుగా ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదని, త్వరం మంజూరయ్యేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి తిరుగు ప్రయాణంలో సంబంధిత అధికారులతో మాట్లాడతానని, బిల్లులకు సంబంధించిన వివరాలు, టోకెన్లు సిద్ధం చేసి ఉంచుకోండని తెలిపారు. మండలంలో దానమయ్యగారి పల్లి టోల్‌గేట్ వద్ద ఎదురుచూస్తున్న కార్యకర్తలను చూసి మంత్రే స్వయంగా కారు ఆపి వారితో మాట్లాడి త్వరలోనే బిల్లులు అందుతాయని హామీ ఇచ్చారని స్పష్టం చేశారు. అయితే ఇవేవీ పూర్తిగా తెలుకోకుండానే సొంత కార్యకర్తలే మంత్రిని అడ్డుకున్నారని, ఆయన వారిని పట్టించుకోకుండా వెళ్లిపోయారని అమరనాథ రెడ్డి మీడియాకు చెబితే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. సమావేశంలో ఆయనతో పాటు ఉప సర్పంచ్ అక్మల్ ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి

పుత్తూరు: వడమాలపేట మండలం పూడి రైల్వే స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి కథనం మేరకు, పూడి రైల్వే స్టేషన్ సమీపంలో తిరుచానూరుకు చెందిన ఎం.పాండు (29) తల, మొండెం వేరుగా రైల్వే ట్రాక్‌పై పడి ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. మృతుడు తిరుచానూరులో ప్రొవిజన్స్ షాపు నడుపుతున్నాడు. భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడు జేబులో వేపమాను స్ట్రీట్, తిరుచానూరు, 99660 35307, 93818 96552 అని రాసి ఉన్న కార్డును గుర్తించారు. సదరు నెంబరుకు ఫోన్ చేసి బంధువులకు విషయం తెలియజేశారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడి దుర్మరణం


లక్ష్మీపతినాయుడు (ఫైల్)

పుత్తూరు: రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడు దుర్మరణం చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్, పంచాయతీ వార్డు సభ్యుడు లక్ష్మీపతినాయుడు(68) భార్య లక్ష్మీకాంతమ్మతో కలిసి మోటార్ సైకిల్‌పై వేపగుంట నుంచి గ్రామానికి వస్తుండగా నగరి నుంచి పుత్తూరు వైపు వస్తున్న వ్యాన్ వెనక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీపతినాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మీకాంతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం..ముగ్గురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి తీసుకెళ్తున్న ముగ్గురు నిందితులను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. చిత్తూరు టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని పీహెచ్ కాలనీ వద్ద సీఐ, ఎస్ఐ నాగరాజు తనిఖీ చేపట్టారు. ఒక మోటారు సైకిళ్లు ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా 1.7 కిలోల గంజాయిని గుర్తించారు. పుత్తూరు నగరానికి చెందిన లోకేష్(35), సతీష్ (22), విజయ్ (42) అనే ముగ్గురు నిందితులను గుర్తించారు. వారి నుంచి గంజాయితో పాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్.వి ట్రావెల్ ఎక్స్‌పో మేళా

చిత్తూరు రూరల్: నగరంలోని భాస్కర హోటల్లో ఈ నెల 27, 28 తేదీల్లో ఆర్.వి ట్రావెల్స్ ఎక్స్‌పో -2024 మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ ట్రావెల్స్ అధినేత ఆర్.వి రమణ తెలిపారు. ఆర్.వి టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 100పైగా ఆకర్షణీయమైన టూర్ ప్యాకేజీల భారీ డిస్కౌంట్, లక్కీ డిప్ ద్వారా ఉచిత టూర్లను పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. అయోధ్య, అమర్‌నాథ్, చార్‌ధామ్, కైలాస్, మానస సరోవర్, సిమ్లా-మనాలి, ఆస్ట్రేలియా, సింగపూర్, యూరప్, దుబాయ్, బ్యాంకాక్ వంటి అంతర్జాతీయ యాత్రలు ఇందులో ఉంటాయని చెప్పారు. ఇతర వివరాలకు 9121143964, 917733615 నంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.